వరికి తెగుళ్ల బెడద

- నివారణకు అదనపు ఖర్చులు
- దిగుబడిపై ప్రభావం
- అవగాహన కల్పించని అధికారులు


పాన్‌గల్‌లో సుడిదోమ సోకిన వరిపంట

పాన్‌గల్: మండలంలో రైతులు సాగు చేస్తున్న పంటల్లో ప్రధాన పంట వరి. వరుసగా కురిసిన భారీ వర్షాలతో పంటలపై తెగుళ్ల దాడి పెరిగింది. వర్షాల అనంతరం వాతావరణంలో మార్పులే దీనికి ప్రధాన కారణంగా చెబుతున్నారు శాస్త్రవేత్తలు. ఒక వైపు వర్షం, మరో వైపు ఎండ, ఉక్కపోత ఉండటంతో ఈ పరిస్థితి ఏర్పడుతోందంటున్నారు. పురుగు కంటే తెగుళ్ల తీవ్ర ఎక్కువగా ఉన్నట్లు అన్నదాతలు వాపోతున్నారు. ముందుగా నాట్లు వేసిన పంటలో పొట్టదశలో ఉన్న పొలాల్లో సుడిదోమ, పాము పొడ, కాటుక (మానిపండు) కంకినల్లి, బ్యాక్టీరియా, ఆకు ఎండు అధికంగా ఉందని రైతులు వాపోతున్నారు. ఆలస్యంగా నాటు వేసిన పొలాల్లో వీటితో పాటు అదనంగా ఆకు ముడత సోకింది. కొన్ని రకాల సన్న ధాన్యం పంటకు ఎండకు తెగులు వస్తున్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పంట ఈత దశ అనంతరం గింజ పోసుకునే సమయంలో కంకినల్లి, సుడిదోమ, బ్యాక్టీరియా సమస్య ఎక్కువగా ఉంటుంది. అంటే పంట చేతికి వచ్చేసరికి రెండు సార్లు మందులు పిచికారి చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఆలస్యం చేస్తే దిగుబడిపై ప్రభావం చూపుతుందని అన్నదాతలు ముందస్తుగానే మందులు పిచికారి చేస్తున్నారు. ఎకరానికి రూ.30వేల వరకు పెట్టుబడులు పెట్టి పంటలను సాగు చేయడం మరో పక్క ఈ తెగుళ్లతో మందుల పిచికారికి అదనపు ఖర్చు చేయాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెగుళ్ల బారిన పడిన పంట పూర్తిగా రంగు మారి ఎండిపోవడం, గింజ రంగు మారుతోందని, దీంతో తెగుళ్ల వ్యాపించి తీరని నష్టాన్ని కలిగిస్తోందని మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


వరి పంటకు తెగులు ఆశించడంతో ఎండుముఖం పట్టిన పంట

మండలాల వారీగా సాగు చేసిన వరి పంట వివరాలు	
మండలం	సాగు చేసిన వరి పంట (ఎకరాల్లో)
పాన్‌గల్	19,580
చిన్నంబావి	7,310
వీపనగండ్ల	14,424

అవగాహన కల్పించని అధికారులు

మండలంలో తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, పిచికారి చేయాల్సిన మందుల గురించి వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించకపోవడంతో ఫర్టిలైజర్ దుకాణదారులు సూచించిన పిచికారి చేస్తున్నట్లు వాపోతున్నారు. ఏఈఓలు ఎక్కడ కూడా గ్రామాల్లో పర్యటించిన దాఖలాలు లేవని రైతులు వాపోతున్నారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి తెగుళ్లపై అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

తెగుళ్లతో ఇబ్బందులు



పొలంలో 3 ఎకరాల్లో వరి పంటను సాగు చేశాను. పంటగింజలు పట్టే దశలో ఉంది. బ్యాక్టీరియా, ఆకు ఎండుతెగుళ్ల, సుడిదోమతో గింజలు నల్లగామారడం, పంట ఎండిపోవడం వంటివి జరుగుతున్నాయి. నివారణ మందులకు రూ.7,500 వరకు ఖర్చు చేశాను. అధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులకు అవగాహన కల్పించాలి.

– కుర్మయ్య, రైతు పాన్‌గల్

అదనపు ఖర్చులు



ఐదు ఎకరాల్లో వరి పంటను సాగు చేశాను. తెగుళ్ల నివారణ మందులను రెండుసార్లు పిచికారి చేశాను. ఒక్కసారికి దాదాపుగా రూ.3వేల నుంచి రూ.4వేల వరకు ఖర్చు అయింది. దీంతో అదనపు భారంతో పాటు దిగుబడి కూడా తగ్గే అవకాశం ఉంది.

– తిరుపతిరెడ్డి, రైతు, వెంగళాయిపల్లి

నివారణ చర్యలు ఇలా..



వరి పంటకు బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు ఆశించింది. దీంతో ఆకు చివర నుంచి కింది వరకు తడిసినట్లుగా ఉండి పసుపు రంగుకి మారి ఆకులు ఎండిపోయి మొక్కలు చనిపోతాయి. దీని నివారణకు తెగులు 5శాతం కంటే ఎక్కువగా ఉంటే నత్రజని వేయడం తాత్కాలికంగా నిలిపివేయాలి. తెగులు వ్యాప్తిని అరికట్టేందుకు అగ్రిమైసిన్ లేదా ప్లాంటమైసిన్ లేదా పోషమైసిన్ 5 నుంచి 7 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేస్తే తెగుళ్ల నివారించవచ్చున్నారు. ఏఈఓలు క్షేత్రస్థాయిలో పర్యటించి నివారణ చర్యలు సూచించేలా తీసుకుంటాం.

– డాకేశ్వర్‌గౌడ్, ఇన్‌చార్జ్ ఏఓ, పాన్‌గల్

ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు

వనపర్తి: బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను యాజమాన్యాలు ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. మంగళవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర ఎస్సీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. జిల్లా నుంచి కలెక్టర్ పాల్గొని వివరాలు వెల్లడించారు. జిల్లాలో ఎస్సీ విద్యార్థులకు 6, ఎస్టీ విద్యార్థులకు 2 ప్రైవేట్ పాఠశాలలతో ఒప్పందం కుదుర్చుకొని విద్యార్థులను చేర్పించినట్లు తెలిపారు. ఇప్పటికే ఆయా పాఠశాలల యాజమాన్యాలతో మాట్లాడామని.. అందరు విద్యార్థులు చదువుకుంటున్నట్లు చెప్పారు. వీసీలో అదనపు కలెక్టర్లు ఎస్.ఖీమ్యానాయక్, యాదయ్య, డీఆర్డీఓ ఉమాదేవి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మల్లికార్జున్, మైనార్టీ సంక్షేమశాఖ అధికారి అఫ్జలుద్దీన్, బీసీ సంక్షేమశాఖ అధికారి ముజాహిద్ ఖాన్ పాల్గొన్నారు.

మెరుగైన వసతులు కల్పించాలి..

విద్యార్థినులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొందరు విద్యార్థులను బయటకింద కూర్చోబెట్టడంపై అసహనం వ్యక్తం చేస్తూ తరగతి గదిలోనే కూర్చోబెట్టాలన్నారు. కళాశాలలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. మరుగుదొడ్లు, తరగతి గదుల విషయంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని కోరారు. అదనపు తరగతి గదుల నిర్మాణం గురించి సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకురాగా.. నిర్మాణానికి ఎంత ఖర్చవుతుందని ఈడబ్ల్యూఐడీసీ ఇంజినీరింగ్ అధికారులతో ఆరా తీశారు. కలెక్టర్ వెంట కళాశాల ప్రిన్సిపల్, ఇంజనీరింగ్ అధికారులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి

గోపాల్‌పేట: సీపీఆర్‌పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉంటే ఆపద సమయంలో మనిషి ప్రాణాలు కాపాడొచ్చని డాక్టర్ కృష్ణకుమారి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సీపీఆర్ ఎప్పుడు చేయాలి, ఎలా చేయాలి సీపీఆర్ చేస్తున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ చాంద్‌పాషా, సూపర్‌వైజర్లు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ కృష్ణకుమారి

సైబర్ వలలో పడి మోసపోవద్దు


మాట్లాడుతున్న ఎస్‌ఐ స్వాతి

అమరచింత: విద్యార్థులు చదువుల్లో రాణించాలని, ఆన్‌లైన్ గేమ్‌లకు ఆకర్షితులై ఫోన్‌లో వచ్చే మెసేజ్‌లకు సమాధానం ఇస్తూ సైబర్‌వలలో పడి మోసపోవద్దని ఎస్‌ఐ స్వాతి అన్నారు. పట్టణంలోని విజేత ఉన్నత పాఠశాలలో సైబర్‌మోసాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ మోహన్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల అందజేత..

సెల్‌ఫోన్లను పోగొట్టుకున్న ఇరువురికి మంగళవారం తమ అప్పగించడం జరిగిందని ఎస్‌ఐ స్వాతి తెలిపారు. నాగల్ కడ్మూర్‌కు చెందిన తెలుగు గోవింద్, చిన్నచింతకుంట మండలం ఉంద్యాల చెందిన కోట్ల కతలన్న గత పక్షం రోజుల కిందట అమరచింతకు వస్తూ తమ సెల్‌ఫోన్లను పోగొట్టుకున్నారని తెలిపారు. ఐసీఐఆర్ పోర్టర్‌లో ద్వారా ఫోన్లను ట్రేస్ చేసి వాటిని స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించారన్నారు.

వేరుశనగ ఉత్పత్తి పెంచాలి

పాన్‌గల్: నూనెగింజల ఉత్పత్తిని పెంచేందుకు రైతులకు వందశాతం సబ్సిడీపై ఉచిత వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తగా నాబార్డు, రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వందశాతం సబ్సిడీపై వేరుశనగ విత్తనాలను మంగళవారం వ్యవసాయ అధికారులు రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొల్లాపూర్ నియోజకవర్గంలో రైతుల ఆర్థిక స్వాలంబన పెంపొందించేందుకు మంత్రి జూపల్లి చొరవ తీసుకొని ఉచితంగా వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏడీఏ తిప్పేస్వామి, ఏఓ డాకేశ్వర్‌గౌడ్, డైరెక్టర్ శివశంకర్, కన్వీనర్ కేతూరి ధర్మతేజ, శ్రీనివాస్ కుమార్, కాంగ్రెస్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, వెంకటేష్‌నాయుడు, రవికుమార్, రాముయాదవ్, పుల్లారావు, బ్రహ్మయ్య పాల్గొన్నారు.


విత్తనాలను పంపిణీ చేస్తున్న నాయకులు

మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం


మాట్లాడుతున్న జడ్జి వి.రజని

మదనాపురం : విద్యార్థులు మత్తు పదార్థాలకు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి వి.రజని అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కస్తూర్బా బాలికల విద్యాలయంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో.. విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రజని విద్యార్థులకు ఆర్టికల్ (14) (19) (21) ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమాల్లో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కృష్ణయ్య, సీనియర్ న్యాయవాది అశోక్‌గౌడ్, హెచ్‌ఎం మద్దిలేటి, ప్రత్యేకాధికారి రేణుక పాల్గొన్నారు.

‘నచ్చిన వారికేనా ఇందిరమ్మ ఇళ్లు’


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు నారాయణ

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో గ్రామంలో కొందరు మధ్యలో వచ్చిన నాయకులు తమకు నచ్చిన వారికే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయిస్తున్నారని కాంగ్రెస్ ఖిల్లాఘనపురం పట్టణ అధ్యక్షుడు బెస్త నారాయణ తెలిపారు. మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల బాధితులతో కలిసి ఆయన ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో ఏ ఒక్క నాయకుడు కాంగ్రెస్ గురించి పట్టించుకోని రోజుల్లోను గ్రామంలోని కొందరు నాయకులతో కలిసి నాటి నుంచి నేటి వరకు తాను పార్టీ కోసం పనిచేయడం జరిగిందన్నారు. నాడు అధికారంలో ఉన్న నాయకులు ఎన్ని ఇబ్బందులు పెట్టిన పార్టీ కోసం భరించామని ఆయన చెప్పారు. అలాంటిది మధ్య వచ్చిన కొందరు నాయకులు ఎవరికి తెలియకుండా ఇందిరమ్మ కమిటీలో పేర్లు రాయించుకుని వారికి నచ్చిన వారికి ఇళ్లు మంజూరు చేయడం ఏమిటన్నారు. చివరకు పట్టణ అధ్యక్షుడైనా నాకే ఇల్లు లేకుండా చేయడం జరిగిందని చెప్పారు. గ్రామానికి మొదట్లో 108 ఇళ్లు మంజూరైనట్లు చెప్పారని, తరువాత 60ఇళ్లు మాత్రమే వచ్చాయన్నారు. ఈ రెండు జాబితాల్లో మా పేరు ఉందన్నారు. కాని చివరగా 56 మందితో మరో జాబితా తయారు చేశారన్నారు. చివరిలిస్టులో నా పేరు తొలిగించడం జరిగిందని చెప్పారు. ఇళ్లు కట్టుకొని వారిస్థానంలో కొత్తవారిని తీసుకునే ముందు ఎవరిని అడిగి పేర్లు మార్చుతున్నారని దుయ్యబట్టారు. నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తిని, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి క్లాస్‌మెంట్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షున్నైనా నాకు ఇళ్లు మంజూరు కాలేదంటే జనాలు నవ్వుకుంటున్నారని చెప్పారు. ఇప్పటికే పంచాయతీ కార్యదర్శి, ఎంపీడీఓ, తహసీల్దార్, ఎమ్మెల్యే, కలెక్టర్ అందరికి వినతిపత్రాలు ఇచ్చి ఓపిక నశించి విలేకరులతో మాట్లాడుతున్నారన్నారు. త్వరలోనే కాంగ్రెస్ సభ్యత్వానికి రాజీనామా చేసి మాదారి మేము చూసుకుంటామన్నారు. సమావేశంలో నాగయ్య, పెద్ద శేషయ్య, నాగరాజు పాల్గొన్నారు.

సిరంజీలను తొలగించిన అధికారులు


సిరంజీలను పరిశీలిస్తున్న మెడికల్ ఆఫీసర్

సాక్షి ఎఫెక్ట్..

గోపాల్‌పేట: సోమవారం ‘సాక్షి’ దినపత్రికలో ‘‘రోడ్డుపక్కన సిరంజీలు’’ అనే కథనం ప్రచురితమైంది. మంగళవారం ఈ విషయంపై మండల వైద్య అధికారులు స్పందించారు. మెడికల్ ఆఫీసర్ చాంద్‌పాషా సిబ్బందితో కలిసి సిరంజీలు పడేసిన వద్దకు చేరుకుని పరిశీలించి తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సిరంజీలు ప్రభుత్వ దవాఖానకు సంబంధించినవి కాదని తెలిపారు. గుర్తు తెలియని ప్రైవేట్ వ్యక్తులు, ఆర్‌ఎంపీ డాక్టర్లు పారబోసి ఉండవచ్చన్నారు. వారివెంట పంచాయతీ కార్యదర్శి బాలరాజుకు సమాచారం అందించి వారి సిబ్బంది ద్వారా శుభ్ర చేయించారు.

వంతెనల మరమ్మతు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..

ఖిల్లాఘనపురం: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లకు ఏర్పాటు చేసిన వంతెనలు భారీ వర్షాలకు కుంగిపోవడం, గోతులు పడటం జరిగింది. ఈ విషయమై ‘ప్రయాణం..ప్రమాదం’ అనే కథనంతో సాక్షి దినపత్రికలో సోమవారం వార్త కథనం ప్రచురించారు. స్పందించిన ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు అసంపూర్తిగా ఉన్న వంతెన పనులను మంగళవారం ప్రారంభించారు. 10రోజుల్లో వంతెన పనులు పూర్తి చేస్తామని ఏఈ రాకేష్ తెలిపారు.


పనులను చేయిస్తున్న కాంట్రాక్టర్

ఆలయ భూములు రక్షించాలి

ఖిల్లాఘనపురం: మండలంలోని ఉప్పరిపల్లి బద్రీ నారాయణ స్వామి ఆలయ భూమును కాపాడాలని గ్రామస్తులు మంగళవారం మహబూబ్‌నగర్ దేవాదాయశాఖ సూపరింటెండెంట్ రఘునాథ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. బద్రీనారాయణ స్వామి ఆలయం పేరున పూర్వకాలం నుంచి 19.20 ఎకరాల భూమి ఉందన్నారు. గ్రామానికి చెందిన కొందరు నాయకులు గతంలో 3 ఎకరాలు, ఇటీవల 2 ఎకరాలు అన్యాక్రాంతం చేశారన్నారు. గ్రామస్తులందరు కలిసి రూ.15లక్షలు పోగు చేసుకుని ఆలయ పునర్నిర్మాణం, భూములు అన్యాక్రాంతం కాకుండా కంచె ఏర్పాటు చేశారమన్నారు. రాజకీయ నాయకుల అండతో కొందరు స్తంభాలను ధ్వంసం చేసి డబ్బాలను ఏర్పాటు చేసుకుంటున్నారని తెలిపారు. దేవాదాయశాఖ అధికారులు వచ్చి పరిశీలించి భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు గోవర్ధన్‌రెడ్డి, రాంరెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు ఏఐసీసీ పరిశీలకుడి రాక

ఆత్మకూర్: పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామి, రాష్ట మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి బుధవారం ఆత్మకూర్‌కు వస్తున్నారని మార్కెట్ కమిటీ చైర్మన్ రహ్మతుల్లా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పరమేష్ తెలిపారు. స్థానిక జీవీఆర్ కన్వెన్షన్ హాల్లో మధ్యాహ్నం 2 గంటలకు అమరచింత, ఆత్మకూర్ మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశమవుతారన్నారు. జిల్లా నూతన అధ్యక్షుడి ఎంపికపై అభిప్రాయాలను సేకరిస్తారన్నారు.

పరిశుభ్రంగా ఉండాలి

పాన్‌గల్: ప్రతిఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే రోగాలకు దూరంగా ఉండొచ్చని పీహెచ్‌సీ వైద్యుడు డా.చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని రేమద్దుల గ్రామంలో డెంగ్యూ అనుమానితులు ఉండటంతో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి రక్త నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడారు. పరిసరాలల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఏఎల్‌ఓ టీమ్ సభ్యులు గంధం రాజు, లక్ష్మణ్, సాయన్న, వైద్యులు లారెన్స్ పాల్గొన్నారు.

ఆరోగ్య నియమాలు పాటించాలి

అమరచింత: గర్భిణీ మహిళలు ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవడమే కాకుండా ఆరోగ్య నియమాలను పాటించాలని అప్పుడే కడుపులోని బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతాడని డీఎంఆర్‌ఎం ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల డాక్టర్ మానస అన్నారు. ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు పలు ఆరోగ్య సలహాలను అందించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్‌లతో పాటు ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కాలనీవాసుల ఆర్థికసాయం

గోపాల్‌పేట: తమతో పాటు ఉంటూ అకస్మాత్తుగా మరణించిన వ్యక్తి కుటుంబానికి కాలనీవాసులు అండగా నిలిచారు. మండలకేంద్రంలోని రాంనగర్ కాలనీకి చెందిన డ్యారపోగు రామచంద్రి ఇటీవల మృతి చెందాడు. కాలనీ యువకులు అంతా కలిసి తమవంతుగా రూ.15వేలు పోగు చేసి రామచంద్రి భార్య విజయకు మంగళవారం అందజేశారు.

అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూర్: అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు అప్రమత్తంగా ఉండి సురక్షితంగా బయటపడాలని ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సైదులు అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అగ్ని ప్రమాదాలు, నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రమాదాలు సంభవించినప్పుడు అగ్నిమాపక సిబ్బంది తీసుకునే చర్యలు, కాపాడే పద్ధతులను డెమోద్వారా క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు భాగ్యవర్ధన్‌రెడ్డి, టీజే విశ్వేశ్వర్, ఎన్ఎస్ఎస్ ఇంచార్జ్ ఏకే కురుమూర్తి, విద్యార్థులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ బాకీ కార్డులు పంపిణీ

వనపర్తి రూరల్: పెబ్బేరు పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు దిలీప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక నాయకులతో కలసి మంగళవారం పట్టణంలోని 3వవార్డులో బాకీ కార్డులను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ కర్రెస్వామి, మాజీ కౌన్సిలర్లు చిన్న ఎల్లారెడ్డి, గోపిబాబు, పార్వతి పాల్గొన్నారు.

గోపాల్‌పేట: బాకీకార్డులు పంపిణీ చేస్తుంటే కాంగ్రెస్ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బాలరాజు అన్నారు. మంగళవారం బీఆర్‌ఎస్ నాయకుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రజలకు పడిన బాకీలను వివరిస్తూ ఉన్న కార్డులు ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు శ్రీనివాసులు, మాజీ వైఎస్ ఎంపీపీ శేఖర్, కాశీనాథ్ పాల్గొన్నారు.

నల్లతామర నివారణతో అధిక దిగుబడి

అమరచింత: నల్ల తామర నివారణతో మిరప పంటద్వారా అధిక దిగుబడి పొందవచ్చని కేవీకే శాస్త్రవేత్త రాజేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చంద్రనాయక్ తండాలో ఈనాటి రైతు–శాస్త్రవేత్త సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ మేరకు హాజరైన రైతులతో కలిసి సాగు చేస్తున్న మిరపపంటను పరిశీలించారు. ఈసందర్భంగా మిరప పంటల్లో యాజమాన్య పద్ధతులను వివరించారు. వైరస్ తెగులు రావడానికి కారనమైన నల్లతామర పురుగులను కంట్రోల్ చేయడానికి పలు సూచనలు సలహాలను రైతులకు వివరించారు. క్షేత్ర ప్రదర్శనలో భాగంగా కొద్దిమంది రైతులకు జిగురు అట్టలను, వేప నూనే, లింగాకర్షక బుట్టలను పంపిణీ చేశారు. నూనేగింజల పంట అయినటువంటి ఆముదం పంట కొత్త హైబ్రిడ్ విత్తనాలను 30 ఎకరాల వరకు ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఏఓ అరవింద్, ఏఈఓ శివకుమార్ పాల్గొన్నారు.

కళాజాతా ప్రదర్శన

వనపర్తి రూరల్: సోషల్ ఫర్ సోషల్ ట్రాన్స్ పర్మేషన్ అనే స్వచ్ఛంద, ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం కడుకుంట్ల ప్రజలతో సమావేశం నిర్వహించి కళాజాత బృందాలతో సంక్షేమ పథకాలు, సైబర్‌భద్రతపై అవగాహన కల్పించారు. సమావేశంలో స్టేట్ కో ఆర్డినేటర్ అశోక్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ బాలకృష్ణ, కౌన్సిలర్లు ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

ఓట్లచోరీపై సంతకాల సేకరణ

మదనాపురం: రాహుల్‌గాంధీ చేపట్టిన ఓటు చోరీ నినాదం కార్యక్రమానికి మద్దతుగా టీపీసీసీ ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి ఆదేశానుసారం ప్రతి గ్రామ పరిధిలో 100మంది ఓటర్లతో మద్దతుగా రామన్‌పాడు గ్రామంలో మంగళవారం టీపీసీసీ మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ అంజద్ అలీ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు.

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలి

ఖిల్లాఘనపురం: మండలంలో ఇసుకఅక్రమ రవాణా జరుగుతున్న రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కార్యదర్శి బెస్త యాదగిరి అన్నారు. మంగళవారం నెంబర్‌ప్లేట్ లేని ఓ ట్రాక్టర్‌ను ఆపి రెవెన్యూ అధికారులు తనిఖీ చేశారు. ఈ విషయంపై తహసీల్దార్ సుగుణకు ఫోన్ చేసి చెప్పారన్నారు. అధికారి వచ్చి పరిశీలించిన ఎలాంటి అనుమతులు చూపలేదన్నారు. పైగా ఓ అధికార పార్టీకి చెందిన నాయకుని పేరు చెప్పడం జరిగిందన్నారు.

కొనసాగుతున్న శిక్షణ

పాన్‌గల్: మండలకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలల్లో విద్యలో డిజిటల్ టెక్నాలజీపై ఉపాధ్యాయులకు శిక్షణ మంగళవారం రెండోరోజు కొనసాగింది. ఆర్పీలుగా అనంద్‌గౌడ్, వెంకటేష్, నర్సింహా వ్యవహరించారు.

క్లుప్తంగా

ఆర్వోబీ నిర్మించాలి

మదనాపురం: సికింద్రాబాద్ రైల్వే నిలయంలో రైల్వే డిప్యూటీ జనరల్ మేనేజర్ ఉదయ్‌ను మంగళవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి కలిసి పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గ కేంద్రంలో అండర్‌పాస్ సబ్‌వే నిర్మాణానికి సంబంధించి వర్క్ మంజూరు ఇవ్వాలని మదనాపురం రైల్వే గేట్ వద్ద వాహనాలు పెరిగి, అధిక రద్దీ కారణంగా తీవ్రమైన ట్రాఫిక్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అండర్‌పాస్ లేదా ఆర్ఓబీ నిర్మించాలని పేర్కొన్నారు. ఆయన సానుకులంగా స్పందించినట్లు ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో మన్నె జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.

బీమా అందజేత

కొత్తకోట రూరల్: తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పెద్దమందడిశాఖ ఆధ్వర్యంలో సోమవారం మద్దిగట్ల గ్రామానికి చెందిన వాకిటి మన్నెంకొండ (60) కుటుంబానికి రూ.20 లక్షల బీమా క్లెయిమ్ చెక్కు అందజేశారు. విద్యుత్ ఘాతంతో మన్నెంకొండ మరణించగా, ఆయన బ్యాంకులో ఎస్‌బీఐ జనరల్ బీమా పథకం కింద రూ.1000 ప్రీమియం చెల్లించి చెల్లించారు. ఆయన భార్య వాకిటి వెంకటమ్మకు రూ.20లక్షల చెక్కును బ్యాంకు మేనేజర్ జ్ఞానేష్‌గౌడ్, బీడీఎం నరేష్ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకుసిబ్బంది, బ్యాంకుమిత్ర గట్టు రాధాకృష్ణ, సింగిరెడ్డి ఆంజనేయులు పాల్గొన్నారు.

నేటినుంచి గాలికుంటు నివారణ టీకాల పంపిణీ

పాన్‌గల్: మండల పశువైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం నుంచి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు మండల పశువైద్యాధికారి డా.సురేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదటిరోజు దావాజిపల్లిలో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈనెల 15వ తేదీ నుంచి నవంబర్ 14 వరకు కొనసాగుతుందన్నారు.

బీసీ రిజర్వేషన్ల కోసం పోరాడాలి

వనపర్తి రూరల్: రాష్ట్రంలో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలుకు బీసీ సంఘాలు, మద్దతుదారులు పోరాటం ఉధృత్తం చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రమేష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ జీవో తెచ్చారని దాని కొట్టి వేయడం చాలా బాధాకరమన్నారు. కార్యక్రమంలో కురుమయ్య, జయమ్మ పాల్గొన్నారు.

యువతుల అదృశ్యం

వనపర్తి రూరల్: శ్రీరంగాపురం పట్టణంలో అమ్మాయి కనిపించడం లేదని మంగళవారం తండ్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ హిమబిందు కథనం మేరకు.. శ్రీరంగాపురం పట్టణంలోని అమ్మాయి ఇంట్లో ఎవరికి చెప్పకుండా మంగళవారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. మళ్లీ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టూ పక్కల వారి ఇళ్లలో వెతికినా ఆచూకి లభించలేదు. అమ్మాయితండ్రి మంగళవారం శ్రీరంగాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతడి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మృతదేహం లభ్యం

ఆత్మకూర్: మండలంలోని దేవరపల్లి గ్రామశివారులోని చెరువులో గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యమైందని ఎస్సై నరేందర్ తెలిపారు. మంగళవారం ఉదయం అటువైపుగా వెళ్లిన రైతులు చెరువునీటిలో శవం ఉన్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు. సుమారు 45 ఏళ్ల లోపు వయస్సు ఉన్న వ్యక్తి బట్టలు లేకుండా ఉన్నాడని, శవం పూర్తిగా ఉబ్బిపోయివుందని, కుడికాలుకి నల్లటిదారం కట్టి ఉందని వివరించారు. ఆనవాళ్లు తెలిసినవారు పోలీసులను సంప్రదించాలని సూచించారు.

జిల్లా కమిటీ ఎన్నిక

గోపాల్‌పేట: జిల్లా కేంద్రంలో మాదాసి కురువ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలరాజు ఆధ్వర్యంలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారని నూతన అధ్యక్షుడు సంకెండ్ల విష్ణు తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా విష్ణు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని, జనరల్ సెక్రటరీగా ఆంజనేయులు, కోశాధికారిగా గుజ్జరామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా శ్రీశైలం, మల్లికార్జున్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మోటారు శివ, అలాగే కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

పాఠశాలల తనిఖీ

ఖిల్లాఘనపురం: మండలంలోని మల్కాపురం, మానాజీపేట ప్రాథమిక పాఠశాలలను పలు ప్రభుత్వ పాఠశాలలను మంగళవారం ఎంఈఓ జయశంకర్ పరిశీలించి విద్యార్థులతో పాఠాలు చదివించారు. 24 నుంచి పరీక్షలు ప్రారంభమవుతున్నందున విద్యార్థులను అందుకు సన్నద్ధం చేయాలని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు సూచించారు.

హక్కులు కాలరాస్తున్న ప్రభుత్వాలు

ఆత్మకూర్: బీజేపీ,కాంగ్రెస్ ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని సీపీఎం రాష్ట్ర నాయకుడు మహమూద్ అన్నారు. మంగళవారం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రమేష్ అధ్యక్షతన ఎంజీ గార్డెన్‌లో సమావేశం నిర్వహించారు. మండల కన్వీనర్‌గా ఎస్.రాజును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీడీకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుచ్చన్న పాల్గొన్నారు.